క్లుప్తంగా

పుస్తక పఠనంతో ఉత్తమ ఫలితాలు


మునగపాకలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విశ్రాంత ఎంఈవో మోహనరావు అన్నారు. మునగపాక గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, స్కిప్పింగ్, మ్యూజికల్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ కొంత సేపు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలన్నారు. పోటీ పరీక్షలకు హాజరుకావడం ద్వారా మనలో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి అప్పారావు, బూడిద రామారావు, ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషి


సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ మంజు

మునగపాక: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోష్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీ ఆడారి మంజు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం సుభాష్ చంద్రబోష్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనలో బోష్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భీమరశెట్టి శ్రీనివాసరావు, భీమరశెట్టి ఉమాశంకర్, ఆడారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మెనూ అమలు చేయాలి


మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని నాగులాపల్లి హైస్కూల్‌ను ఆయన గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కొంత సేపు ముచ్చటించిన ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాలరావు, పీఎంసీ చైర్మన్ నూకాలయ్య, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వదలని పొగ మంచు


కోటవురట్లలో రహదారిని కమ్మేసిన పొగమంచు

కోటవురట్ల: దట్టంగా అలుముకున్న పొగ మంచుతో మండలవాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. గురువారం మైదానం మంచు ముసుగేసుకుంది. రహదారులను పొగమంచు కమ్మేయడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. రహదారుల్లో పొగమంచు కారణంగా అడుగు దూరంలో కూడా వాహనాలు కనిపించక ఫ్లడ్ లైట్ల వెలుతురులో నెమ్మదిగా వాహనాల రాకపోకలు సాగించారు. ఉదయం 10 గంటలైనా మంచు వీడకపోవడంతో రైతులు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. మంచుకు చలి తోడవ్వడంతో గజగజ వణికిపోయారు.

ధాన్యం.. రైతు దైన్యం

- ఖరీఫ్ వరిపై తుపాన్ల ప్రభావం
- రంగుమారిన తడిసిన ధాన్యం
- కొనుగోలుకు ప్రభుత్వం కొర్రీలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన వరి రైతుల పరిస్థితి దైన్యంగా మారింది. ప్రకృతి విపత్తులు ఓ వైపు.. ప్రభుత్వ నిర్లక్ష్యం మరో వైపు వారిని నట్టేట ముంచింది. చేతికొచ్చిన పంట తడిచి చేజారిపోగా రైతులకు ఇక కన్నీరే మిగిలింది. చివరి ప్రయత్నంగా ఒక్క గింజైనా మిగలకపోతుందా? అనే ఆశతో పంట పొలాల్లోనే నూర్పులకు సన్నద్ధమయ్యారు. రంగు మారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కొర్రీలు పెట్టడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక ఎంతో కొంతకు దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితులు ఎస్.రాయవరం మండలంలో నెలకొన్నాయి.


రంగు మారిన ధాన్యాన్ని శుభ్రం చేస్తున్న రైతులు


నూర్పు తరవాత వచ్చే రంగు మారిన గడ్డిని ఆరబెడుతున్న మహిళా రైతు


ఎండబెట్టిన రంగు మారిన ధాన్యం

ఎస్.రాయవరం: ఖరీఫ్ పంట ఆశాజనకంగా ఉన్నా ఫలితం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది సాధారణ విస్తీర్ణానికి మించి 6,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. వరినాట్లు ప్రారంభం నుంచి గత ఏడాది వరుస తుపాన్లు సంభవించాయి. అయినప్పటికి రైతు ఆరుగాలం శ్రమించి పంటను పండించారు. కోతలు సమయంలో కూడా వరుస తుపానులు, ఎడతెరిపిలేని వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. కోసిన పంట కొన్ని రోజుల పాటు, కుప్పలు వేసిన తరువాత మరికొన్ని రోజులు తడిసిముద్ధయ్యాయి. ఆ వర్షాలు సమయంలో హడావుడిగా కుప్పలు వేయడంతో నెల రోజులు గడవక ముందే హోయి వచ్చి పొగలు కక్కుతూ ఉన్నాయి. ఇది గమనించిన రైతులు పైరు పంట ఉన్నప్పటికి వచ్చే కాస్త గింజలు ఇంటికి చేర్చుకుందామని, నూర్పులు మొదులు పెట్టారు. తడితో కుప్పలు వేయడంతో ధాన్యం పూర్తిగా రంగుమారిపోయి, ముక్కపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో, దళారులు, ప్రైవేటు మిల్లర్లు కారు చౌకగా అడుగుతున్నారని వాపోతున్నారు. రంగు మారిన ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు కుదరకపోవడంతో పంట పండినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇలా నూర్పులు చేసిన ధాన్యంతో పాటు వచ్చే గడ్డి కూడా పాడైందని, పశువులు తినేందుకు వీలు లేకుండా పోయిందని చెబుతున్నారు.


తడిచిన కుప్పలు నూర్పులు చేస్తున్న రైతులు

అందని ప్రభుత్వ సాయం

ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రూపాయి పెట్టుబడి సాయం అందివ్వకపోయినా రైతులు అప్పులు చేసి పంట పండించారు. వర్షాలు కారణంగా రెట్టింపు ఖర్చులయ్యాయి. ఎలాగోలా చేతికివచ్చిన పంట కనీసం పశువులు మేతకు కూడా ఉపయోగపడటం లేదని ఇప్పుడు రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ అంతర్ పంటగా అపరాలు సాగు చేయడం ఆనవాయితీ. వరి కుప్పలు వేసిన మార్చి, ఏప్రిల్ నెలల్లో నూర్పులు చేస్తుంటారు. అయితే తడిచిన కుప్పలు ఆలస్యం చేస్తే మరింత పాడవుతాయని అవకాశం కుదిరిన రైతులు నూర్పులు మొదులు పెట్టారు. ఆ ధాన్యం కొనే నాథుడు లేక దిగాలు చెందుతున్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నాణ్యత బట్టే ధర నిర్ణయం



ఎస్.రాయవరం మండలానికి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రం నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామంలో ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం. రంగుమారిన, తడిచిన ధాన్యాన్ని నాణ్యత బట్టి తీసుకుంటున్నాం. బాగా ఉన్న ధాన్యానికి పూర్తి ధర చెల్లిస్తున్నాం. తడిచిన ధాన్యానికి 5 శాతం వరకు కలిపి తీసుకుంటున్నాం. అంతకు మించితే నాణ్యత కొలమానంగా ధర ఇస్తున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వహణ పొడిగించాలని ప్రభుత్వానికి నివేదిక పంపాం.

– సౌజన్య, వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం మండలం

పెట్టుబడి కూడా రాలేదు..



వరి నాట్లు వేసిన నాటి నుంచి వర్షాలు తీవ్రత ఎక్కువగా ఉంది. **చివరికి కోతలు చేవట్టి** కుప్పలు వేసుకునే సమయంలో కూడా పంట **తడిచిపోయింది.** తీరా నూర్చాక ధాన్యం రంగు మారిపోయి, **ముక్కలైపోతున్నా**యి. నాకున్న ఎకరం పొలంలో రూ.30 వేలు **పెట్టుబడితో పండిం**చుకుంటే తిండిగింజలు వస్తాయనుకున్నాను. **ఇప్పుడు కనీసం** పశువుల మేతకు కూడా ఉపయోగపడని గడి, తినడానికి పనికి రాని ధాన్యం చేతికొచ్చాయి. పెట్టుబడిపోయింది. పంటా పోయింది.

– సమ్మెంగి నాగమణి, మహిళా రైతు, గోకులపాడు, ఎస్.రాయవరం మండలం

కొనే నాథుడు లేరు..



ఎకరంన్నర పొలంలో రూ.40 వేలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేశాను. కుప్ప వేశాక వర్షానికి తడిపోయింది. తీరా నూర్పు చేశాక ధాన్యం కొనుకోలు చేసే నాథుడు లేరు. వ్యవసాయాధికారులు చుట్టూ తిరిగితే ధాన్యం నాణ్యత బట్టి డబ్బులు వస్తాయని చెబుతున్నారు. ఆదుకునే నాథుడు లేరు. గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం అయినా అందేది. ఇప్పుడు అదీ లేదు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టాం. అప్పులు తీర్చే మార్గంలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– నూతి గోవిందు, కౌలు రైతు, గోకులపాడు

వక్తృత్వ పోటీల్లో హారిణి ప్రతిభ


ప్రథమ బహుమతి సాధించిన హారిణిని అభినందిస్తున్న తోటాడ హైస్కూల్ ఉపాధ్యాయులు

మునగపాక: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అనకాపల్లి జీవీఎంసీ పట్టణ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో మునగపాక మండలం తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని లావేటి హారిణి ప్రథమ బహుమతి గెలుచుకుంది. 9వ తరగతి చదువుతున్న హారిణిని గురువారం ఉపాధ్యాయులు అభినందించారు. అనకాపల్లి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా.. హారిణి ప్రతిభ కనబరిచిందని హెచ్‌ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చదువులో ఏకాగ్రత, పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదన్నారు. ఈ నెల 25న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా హారిణి బహుమతి అందుకుంటుందన్నారు. తమ స్కూల్‌కు చెందిన హారిణి జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం సాధించడంపై పీఎంసీ చైర్మన్ కరణం సంతోష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్ల నిర్మాణానికి రూ.4.99 కోట్లు మంజూరు

నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.4.99 కోట్లు మంజూరయ్యాయని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ప్రత్యేక మరమ్మతుల కింద గొడిచర్ల జగన్నాథపురం మీదుగా చీడిక రోడ్డు నిర్మాణానికి రూ.1.62 కోట్లు విడుదలయ్యాయన్నారు. వీటిలో 1.21 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్(75శాతం) నిధులు కాగా.. రూ.40 లక్షలు(25 శాతం) పంచాయతీ నిధులన్నారు. జాతీయ రహదారి నుంచి చినరామభద్రపురం రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్లు కాగా.. రూ.90 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, రూ.30 లక్షలు పంచాయతీ నిధులని తెలిపారు. జగన్నాథపురం నుంచి ముకుందరాజుపేట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు, ముకుందరాజుపేట నుంచి దోసల పాడు అగ్రహారం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.32 లక్షలు, గునిపూడి నుంచి గోపాలపట్నం వరకు రూ.1.35 కోట్లు మంజూరయ్యాయన్నారు. మొత్తం రూ.4.99 కోట్లకు గాను ఎన్ఆర్ఈజీఎస్ వాటా రూ.3.74 కోట్లు కాగా.. పంచాయతీల వాటా కింద రూ.1.24 కోట్లు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన చెప్పారు. గురువారం చినరామభద్రపురం రోడ్డు నిర్మాణపు పనులను ఆయన కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లోవతల్లమ్మ తీర్థం


లోవతల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాంబిల్లి(యలమంచిలి): గోకివాడలో కొండపై కొలువుదీరిన గ్రామ దేవత లోవతల్లమ్మ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా జరిగింది. గోకివాడ, మూలకొత్తూరు గ్రామాల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే లోవతల్లమ్మను భక్తులు ఉదయం నుంచి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు. మండలంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద మహిళల కోలాటం, తోడపెద్దు, సాముగరిడీలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి గ్రామ సర్పంచ్ నీరుకొండ శారద వెంకటసూర్యనారాయణ దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వారపురెడ్డి నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పొట్నూరు శివశంకర్, నానాజీ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు

కొండవారిపాలెం గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పశు పోషణలో జాగ్రత్తలు అవసరం


అరబుపాలెంలో పశువులను పరీక్షిస్తున్న పశు వైద్యాధికారి పద్మజ

మునగపాక: పశువుల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాగులాపల్లి పశువైద్యాధికారి పద్మజ కోరారు. మండలంలోని అరబుపాలెంలో గురువారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో పాడి రైతులకు ఆమె మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు సకాలంలో పరీక్షలు చేయించాలన్నారు. పశువుల ఎంపికపై కూడా దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, కృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న జిల్లా ప్రతినిధి లోవరాజు

యలమంచిలి రూరల్: బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల భవిష్యత్ నాశనమవుతుందని జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు చెప్పారు. మండలంలోని పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం బాల్య వివాహాలు–అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, చైల్డ్ వెల్ఫేర్ శాఖ సేవల గురించి వివరించారు. బాల్య వివాహాలు చేసిన వారు, ప్రోత్సహించిన వారు చట్ట ప్రకారం శిక్షలకు గురవుతారని హెచ్చరించారు. మండల స్థాయిలో బాల్య వివాహాల నివారణకు ఒక కమిటీ ఉందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శోభారాణి, రూప, సర్వేశ్వరరావు, నూకరాజు, జీవిత, హైమ, ఉషా పాల్గొన్నారు.

కేవీ పురంలో పారిశుధ్య డ్రైవ్

కోటవురట్ల: కె.వెంకటాపురంలో గురువారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లోని చెత్తను శుభ్రం చేసి ఇళ్ల నుంచి చెత్తను సేకరించారు. కాలువల్లో పూడిక తీసి, బ్లీచింగ్ చల్లారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఆ గ్రామ సర్పంచ్ కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: మండలంలోని దార్లపూడి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఏటికొప్పాక, కొత్తలి ఫీడర్ల పరిధిలో మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అనకాపల్లి(ఆపరేషన్స్) డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఏటికొప్పాక, కొత్తలి, పేరంటాలపాలెం, ములకలాపల్లి, మన్యంపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అవకాశం ఉన్న చోట ఉదయం 4 నుంచి ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, బంగారమ్మపాలెం, పెదఉప్పలం, చినఉప్పలం, రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. పి.ధర్మవరం సబ్‌స్టేషన్ సబ్‌డౌన్ కారణంగా ధర్మవరం, సోమిదేవపల్లి, పెనుగొల్లు, గెడ్డపాలెం తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంపురం, గజపతినగరం, కేశవరం, రామభద్రపురం, పాల్తేరు గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాటుసారా, మద్యం బాటిళ్ల పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు, నాటుసారా

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లులో శుక్రవారం పోలీసులు ఓ వ్యక్తి నుంచి నాటుసారా, మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొడ్డు చిన అప్పారావు వద్ద 3 లీటర్ల నాటుసారా, 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, అప్పారావును రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

బందను పూడ్చేసిన మహిళపై కేసు నమోదు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట మధ్య వీధిలో బందను పూడ్చేసిన మహిళపై తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తిమ్మరాజుపేట సర్వే నంబర్-19లో పూర్వం నుంచి గ్రామానికి సంబంధించిన మురుగునీరు, వర్షపునీరు నిల్వకు అనుకూలంగా బంద ఉండేది. సంక్రాంతి రోజుల్లో గాజువాకకు చెందిన యల్లపు అన్నపూర్ణ ఈ బందను గ్రావెల్‌తో కప్పేసింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్నపూర్ణపై చర్యలు కోరుతూ తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.